క్లుప్తంగా

కేజీబీవీలలో ప్రవేశానికి దరఖాస్తులు

అట్లూరు : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక కేజీబీవీ స్పెషలాఫీసర్ పణిశ్రీ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, 11వ తరగతి ప్రవేశానికి అలాగే 7,8,9 తరగతులలో మిగిలిన సీట్లకు సంబంధించి కూడా ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 లోపల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా అనాథలు, బడి బయట, బడిమానిన, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

విద్వేషపూరిత రాజకీయాలు మానుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయాలు మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాలపై కక్ష పూరితంగా వ్యవహరించి పరువు నష్టం దావా వేయడం సరైన చర్య కాదన్నారు. 2024లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభా భవనంలో శుక్రవారం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట

గోపవరం : మండలంలోని రాచాయపేట కోదండరామస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట శుక్రవారం నిర్వహించనున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య గురువారం నుంచే ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

నేడు విజయనగరంలో ఫ్యామిలీ ఫిజీషియన్

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె పంచాయతీలోని విజయనగరంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి గృహ సందర్శనలో భాగంగా ఇళ్లలో ఉండే దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేస్తామని వైద్యాధికారి చెప్పారు.

అభివృద్ధి పథంలో డీసీసీబీ


వాహనాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు జీఎం జయాకన్నన్, డీసీసీబీ సీఈఓ రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : కడపలోని డీసీసీ బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తుందని సొసైటీల అభివృద్ధికి కడప డీసీసీ బ్యాంకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం అని నాబార్డు జీఎం జయాకన్నన్ పేర్కొన్నారు. టీవీఆర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ వారికి నాబార్డు ఆర్థిక సహాయంతో ఇచ్చిన టెంపో వాహనాన్ని గురువారం కడప డీసీసీ బ్యాంకు ఆవరణలో బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా రైతుల నుండి మామిడి పండ్లు సేకరించి మార్కెట్‌కు తరలించడం జరుగుతుందన్నారు. అనంతరం జాయింట్ లైబిలిటి సంఘాలకు రూ.1,37,00,000 రుణ సహాయం ఆయన చేతుల మీదుగా వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం విజయ విహారి, డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్, పీడీసీ ఇన్‌చార్జు వీర శంకర్, డీసీసీ బ్యాంకు మేనేజర్ గంగాధర్, ఆర్‌హెచ్‌జీబీఎం ఎస్ఎస్ ఎన్‌జీవో రత్నం పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలపండి

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత

కడప అర్బన్ : సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత మహిళా ఖైదీలకు సూచించారు. గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నగర శివార్లలోని ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. అనంతరం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఖైదీల కుటుంబసభ్యులు పొందేందుకు న్యాయసలహాలు, న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం, న్యాయసహాయం రక్షణ సలహా వ్యవస్థను, పారా లీగల్ వలంటీర్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, డాక్టర్, మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతి మహోత్సవాలు


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి ఉత్సవ మూర్తి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక థర్మల్ రోడ్డులోని అష్టభుజ మహా చౌడేశ్వరిదేవి ఆలయంలో ఉగాది పర్వదిన సందర్భంగా జ్యోతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన ఈ ఉత్సవాలు గురువారం ఉదయం వరకు కొనసాగాయి. భక్తులు చౌడేశ్వరిదేవి జ్యోతిని తలపై ఉంచుకుని మంగళవాయిద్యాలకు లయబద్ధంగా నృత్యం చేస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో స్మరించారు. కార్యక్రమానంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పాణ్యం చిన్నసుబ్బరాయుడు, భక్తులు పాల్గొన్నారు.

- స్థానిక హనుమాన్ నగర్‌లోని రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా అమ్మవారికి జ్యోతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవాంగపేట నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తిని చౌడేశ్వరి నామస్మరణల మధ్య ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

ఇ-సర్వీసులను పెంచాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వెంగమునిరెడ్డి

గోపవరం : అన్ని సచివాలయాల్లో ఇ-సర్వీసులను పెంచాలని డీఎల్‌డీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయ సభా భవనంలో గోపవరం, బద్వేలు, బద్వేలు మున్సిపాలిటీ, అట్లూరు మండలాలకు సంబంధించిన వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు డీఎల్‌డీఓ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇ-సర్వీసులను మరింతగా పెంచాలని ఆదేశించారు. వలంటీర్ల సహకారం కూడా తీసుకోవాలన్నారు. ఇ-సర్వీసుల ద్వారా వచ్చిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలన్నారు. ఈ విషయంలో డిజిటల్ సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ప్రజలను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, సకాలంలో సచివాలయంలో ఇచ్చిన ఇ-సర్వీసులను పెండింగ్‌లో పెట్టవద్దని తెలిపారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆధార్ సెంటర్లు ఉన్న సచివాలయాల్లో సేవలను మరింత పెంపొందించాలని సూచించారు. రిజిస్టర్లను మెయింటెనెన్స్ చేయాలని తెలిపారు. అనంతరం బ్రాహ్మణపల్లె, టీ.సంద్రపల్లె సచివాలయాలను డీఎల్‌డీఓ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. యూనిఫాం ధరించని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్టర్ల మెయింటెనెన్స్ కూడా అసంపూర్తిగా ఉండటంతో మరోసారి ఇలా జరిగితే మెమోలు ఇవ్వాల్సి వస్తుందని సిబ్బందిని హెచ్చరించారు. డీఎల్‌డీఓ వెంట గోపవరం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ ఉన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని అమ్మనాన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో గురువారం ముడియం మురళీమోహన్ రెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా ఆయన భార్య తులసి, కుమారుడు నరసింహారెడ్డి, కుమార్తె శ్రీలత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు స్వయంగా వృద్ధులకు భోజనం వడ్డించారు. ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు


రాజుపాలెంలో పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

రాజుపాళెం : ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పార్న పండుగను ఘనంగా నిర్వహించారు. రాజుపాళెంలో భైరవుడు, పెద్దమ్మ, గంగమ్మ, అంకాళమ్మకు తప్పెట్లు, మేళతాళాలతో వెళ్లి మహిళలంతా బోనాలు సమర్పించారు. తమ మొక్కులు తీరాలని జంతు బలులు ఇచ్చారు.

గోసంరక్షణ సమితికి రూ.40వేలు వితరణ


వాహనంతో శివనాగిరెడ్డి, బలరాంరెడ్డి, గోనా ప్రభాకర్‌రెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు : స్థానిక బొల్లవరంలోని గో సంరక్షణ సమితి అధ్యక్షుడు శివనాగిరెడ్డికి మినీ వ్యాన్ కోసం పాతకోట ఆనంద్‌రెడ్డి కుమారుడు బలరాంరెడ్డి రూ.40వేలు వితరణగా ఇచ్చారు. గోశాల నిర్వహణకు మినీ వ్యాన్ కోసం బలరాంరెడ్డి ఆర్థిక సహాయం చేశారని శివనాగిరెడ్డి తెలిపారు. వై.శ్రీకాంత్‌రెడ్డి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, ఎల్.మహేష్‌రెడ్డి, రాజశేఖర్, రవి, అక్రమ్, ఫరూక్ పాల్గొన్నారు.

సన్మానం


నరేంద్ర శర్మను సన్మానిస్తున్న దృశ్యం

చాపాడు : అల్లాడుపల్లె దేవాలయ వేదపండితుడు వేణుతుర్ల నరేంద్ర శర్మను గురువారం శ్రీ బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో సన్మానించారు. నియోజకవర్గ కేంద్రమైన బద్వేలులో శ్రీ బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన పలువురిని సన్మానించారు. శాసనమండలి సభ్యులు డీసీ గోవిందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నరేంద్ర శర్మను ఘనంగా సన్మానించారు.

స్పందనకు గైర్హాజరైన సిబ్బందిపై చర్యలు తప్పవు


గోపవరం సచివాయలంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ రమణారెడ్డి

గోపవరం : సచివాలయాల్లో ప్రతిరోజు నిర్వహించే స్పందన కార్యక్రమానికి గైర్హాజరైన సిబ్బందిపై చర్యలు తప్పవని డీఎల్‌పీఓ ఆర్.రమణారెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని గోపవరం, బేతాయపల్లె, రాచాయపేట సచివాలయాలను ఈఓపీఆర్డీ హసీనాతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంలేదని, స్పందనకు గైర్హాజరవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఇక మీదట ప్రతి నెల సచివాలయాల ఆకస్మిక తనిఖీ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల లోపు బయోమెట్రిక్ వేయాలని, మూమెంట్ రిజిస్టర్‌లో తెలియపరిచి ఫీల్డ్‌కు వెళ్ళాలని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందనకు సచివాలయ సిబ్బంది అందరూ హాజరు కావాలన్నారు. ఎవరైతే సిబ్బంది హాజరు కారో పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు చర్యలు ఉంటాయన్నారు. శాఖలవారీగా సిబ్బంది రిజిస్టర్లు మెయింటింగ్ చేయాలని, అలా మెయింటింగ్ చేయని వారికి మెమోలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విధులకు హాజరయ్యే సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. అన్నిశాఖల అధికారులతో గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలన్నారు. అవసరమైన లబ్ధిదారులకు ఐకేపీ ద్వారా రుణాలు ఇప్పించాలని సూచించారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులను పంచాయతీ కార్యదర్శి వారిని గుర్తించి అవి మొదలు పెట్టేలా చూడాలన్నారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్దతో పాటు రాగిజావ అమలుపై పర్యవేక్షించాలన్నారు. అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామ పంచాయతీల్లో చలవేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ హసీనా, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీరకళ్యాణ్‌రెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎస్‌బిటీఈఆర్ చెన్నై సౌజన్యంతో మే 19న నిర్వహించనున్న (ఈఆర్ఎస్ఈఎం–2023) ఇంజనీరింగ్ సదస్సు పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో అంతర్జాతీయ స్థాయిలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్, మేనేజ్‌మెంట్, బేసిక్ అండ్ సైన్స్‌విభాగాల వారు పరిశోధన పత్రాలను సమర్పిస్తారని కరస్పాండెంట్ బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 24లో పరిశోధన పత్రాలను సమర్పించాలని కోరారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు, ఏఓ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు తోడ్పాటు ఇవ్వాలి

మైదుకూరులో ఘనంగా సేవ్ జర్నలిస్ట్ డే


మాట్లాడుతున్న రూరల్ సీఐ నరేంద్రరెడ్డి

మైదుకూరు : సమాజ హితం కోరే జర్నలిస్టులకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని రూరల్ సీఐ నరేంద్రరెడ్డి అన్నారు. మైదుకూరులోని స్త్రీ శక్తి భవనంలో గురువారం సేవ్ జర్నలిస్ట్ డేను ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు కరెడ్ల కృష్ణ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ డి.శ్రీనాథ్‌రెడ్డి మృతి పట్ల సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రూరల్ సీఐ నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు ఉంటాయన్నారు. కానీ ప్రతిఫలం ఆశించకుండా 24 గంటలు సమాజం కోసం కష్టపడేది జర్నలిస్టులేనని తెలిపారు. వారికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల విధి నిర్వహణలో జర్నలిస్టుల సహకారం ఎంతో ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రాముడు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర విస్మరించలేనిదని తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ గురు అభిలాష్ మాట్లాడుతూ ప్రస్తుతం వార్తలు, సమాచారం అందించడంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ఇందులో జర్నలిస్టుల కృషి చాలా ఉందన్నారు. మైదుకూరుకు చెందిన వెంకట శివ విజన్ ఐటెల్ ఆప్టికల్స్ సహకారంతో అభిలాష్ కంటి ఆస్పత్రి తరపున డాక్టర్ గురు అభిలాష్ నియోజకవర్గంలోని జర్నలిస్టులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, 50 శాతం రాయితీతో కంటి అద్దాలు అందజేశారు. అనంతరం జర్నలిస్టులపై దాడులను ఆపాలని కోరుతూ తహసీల్దార్ అనురాధ, రూరల్ సీఐ నరేంద్రరెడ్డికి జర్నలిస్టులు వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో కొట్టే చంద్రమోహన్, శేగినేని మురళి, యాపరాల వెంకటసుబ్బయ్య, చొక్కం ప్రసాద్, బొమ్మిశెట్టి మోహన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్‌కు నివాళి


శ్రీనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జర్నలిస్టులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏపీ ప్రెస్ అకాడమి చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీనాథరెడ్డి ప్రజల పక్షాన నిబద్ధత పనిచేశారని, జర్నలిజం అభివృద్ధికి కృషి చేశారని పలువురు జర్నలిస్టు నాయకులు కొనియాడారు. అలాగే పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ గురువారం పట్టణంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. పాత్రికేయులపై దాడులను అరికట్టాలని, వేతన భద్రత కల్పించాలని కోరారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


రాజుపాలెంలో చలివేంద్రం వద్ద మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సయ్యదున్నీసా


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు, ఎంపీడీఓ, ఏపీఎం

రాజుపాళెం : ప్రస్తుతం వేసవి కాలమని, చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సయ్యదున్నీసా పేర్కొన్నారు. రాజుపాళెంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఎంపీడీఓ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం జయరాజ్, సీసీలు, వీఓఏలు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం తహసీల్దారు రామచంద్రుడు, ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటి వసతి కల్పించినందుకు ఏపీఎం వీరాంజనేయులు, మండల సమాఖ్య సిబ్బందిని అభినందించారు. ప్రతి రోజు ఈ చలివేంద్రం ద్వారా మినరల్ వాటర్ అందిస్తామని మండల సమాఖ్య కార్యాలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వీఓలు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

ప్రారంభమైన తరావీహ్ ప్రార్థనలు


విద్యుత్ దీప కాంతులతో మక్కా మసీదు

ప్రొద్దుటూరు కల్చరల్ : పవిత్ర రంజాన్‌మాసం వచ్చేసింది. నెల వంక కనిపించడంతో గురువారం రాత్రి నుంచే తరావీహ్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి ఉపవాసాలు ప్రారంభం కానున్నాయి. చిన్న పిల్లలు మొదలు వృద్ధుల వరకు నెల రోజులపాటు కఠిన నియమాలతో ఉపవాసాలను చేస్తారు. రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని అన్ని మసీదులను అందంగా ముస్తాబు చేశారు. మసీదుల ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతోపాటు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆర్ట్స్‌కాలేజి రోడ్డులోని మక్కా మసీదు, గవిని సర్కిల్‌లోని జామియా మసీదు, వన్‌టౌన్ పరిధిలోని మట్టిమసీదు, ఖాదర్‌హుసేన్ మసీదు, పాతబస్టాండ్‌లోని మసీదుతో పాటు పలు ఇతర మసీదులు రంజాన్ సందర్భంగా నూతన శోభను సంతరించుకున్నాయి. రంజాన్ నెల మొదటి రోజు శుక్రవారం అవడంతో అందరు ఉపవాస దీక్షలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కొన్ని మసీదుల నిర్వాహకులు తెల్లవారుజామున సహరీకి భోజన సౌకర్యాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

కడప అగ్రికల్చర్: భూసార పరీక్షలను సకాలంలో పూర్తి చేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని భూసార పరీక్ష కేంద్ర ఏడీఏ, ఏవోలను జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రావు సూచించారు. గురువారం కడప ఊటుకూరులోని భూసార పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్టి నమూనా కేంద్రంలోని పరికరాలను పరిశీలించడంతో పాటు వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించిన మట్టి నమూనాలను పూర్తి చేసి ఫలితాలను వారికి సకాలంలో అందించాలని ఆదేశించారు. భూసార పరీక్షా కేంద్రంలో కొన్ని పరికరాలు పనిచేయడం లేదని ఏడీఏ లక్ష్మీదేవి డీఏఓ నాగేశ్వరావు దృష్టికి తీసుకెళ్లారు. భూసార పరీక్ష కేంద్ర ఏవోలు మంజలరాణి, సుదేష్ణ, ఎంఎస్‌టిఎల్ ఏవో పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు


రక్తదానం చేస్తున్న యువకులు


భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో జనవిజ్ఞానవేదిక, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు నివాళి

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ తమ ప్రాణాలను అర్పించారని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో యువత ముందుకు నడవాలని సూచించారు. పట్టణ కార్యదర్శి రాహుల్, ఉపాధ్యక్షుడు విగ్నేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో రక్తదాన శిబిరం

చాపాడు : స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మండలంలోని పల్లవోలు గ్రామ సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రముఖ కవి మహమూద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ చేసిన త్యాగాలను మర్చిపోకుండా యువకులు రక్తదానం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తిదాయకులని ఆయన బాటలోనే నడుచుకోవాలని సూచించారు. పల్లవోలు రమణ, అఖిల, శశికుమార్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ 92వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పోరుమామిళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ప్రశాంత్, కిరణ్, సుధాకర్, చంటిపాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి

బద్వేలు అర్బన్ : భగత్‌సింగ్ ఆశయ సాధనకు నేటి యువత కృషిచేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా గురువారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహానికి, ఐలమ్మకాలనీ, సుందరయ్య కాలనీల్లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచిత పోరాటం చేసి అతి చిన్న వయస్సులోనే ప్రాణాలు వదిలిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పోరాట పటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల మాజీ నాయకులు శ్రీనివాసులు, నాగేంద్రబాబు, నాగరాజు, డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలుకు సీఎం జగన్ ఆదేశం

– ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారుడు ప్రసాద్‌రెడ్డి

చాపాడు : కడప జిల్లాలో పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసి జిల్లాలో పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అవసరమైన పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం జగన్ అధికారులకు సూచించారని ఆయన పేర్కొన్నారు. కాగా బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ పసుపు రూ.4,600లు ఉండగా, ప్రభుత్వం మద్దతు ధరగా రూ.6850 ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. దీని ద్వారా పసుపు సాగు చేసిన ప్రతి రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. త్వరలోనే జిల్లావ్యాప్తంగా రైతులకు అందుబాటులో ఉండేలా పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చెప్పారు.